


**పదిన్నర** అవుతుండగా వెధవ డొక్కు సైకిల్ని తొక్కుకుంటూ ఆఫీసుకి చేరుకున్నాను. రోజూ ఆ సైకిల్ మీద వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడూ నాకు ఒకపెద్ద అనుమానం వస్తుంటుంది. సైకిల్ నన్ను లాక్కెళుతోందా? నేను సైకిల్ని లాక్కెళుతున్నానా అని! ఈ డొక్కు సైకిల్ మూలాన పడేసి బస్సుల్లో వద్దామా అంటే గడియ గడియకు ఆర్టీసీవాళ్ళు సులువుగా చార్జీ పెంచేస్తున్నారు. నాబోటి బక్క పీనుగులు ఆ చార్జీలు ఎలా భరించ గలరు? అందుకే ఆయాసపడుతూ ఆఫీసుకి చేరుకుంటుంటాను. అలా చేరుకునేసరికి—

"ఏంటోయ్! ఇంకా డబాయిస్తున్నావ్. గంట లేటుగా వచ్చింది చాలక. ఇంకా కరెక్టు టయానికే వచ్చాన్, సార్! అని అరుస్తావా...గంటనుండి ఆఫీసు మెట్లమీద కుక్కలా...ఏంటీ కుక్కలా కాపలా అఘోరించాను. అయినా, నిన్నని ఏం ప్రయోజనంలే! (అపుడే మా యూడీసి గుర్నాథం కూడా రంగప్రవేశం చేశాడు ) పై వాళ్ళకి ఉండాలిగానీ. మిగతా వాళ్ళిద్దరూ ఎలా తగలడ్డా నువ్వొచ్చి తాళం తీస్తే కరెక్టు టైయానికి వచ్చే నాబోటి వాళ్ళు లోపలేడుస్తారుగదా ! ( ఈలోపు ప్యూను తాళం తీశాడు ) హుష్...అమ్మొమ్మొ...గంటనుండీ నించోనీ కాళ్ళు పీక్కుపోయాయి" అనుకుంటూ

లోపలికికెళ్ళాడు, జూనియర్ గుమాస్తా అనబడే శంకర్రావు.

లోపలికెళ్ళే నన్ను చూసి ప్యూను జాలిగా— "చూడండి, సార్! ఇప్పుడు 10—30 అయితే 11—30 అయ్యిందని ఎలా పోట్లాడుతున్నారో చూశారా! పైగా రోజూ లేటొచ్చే ఆయన, లేటు గురించి మాట్లాడటం."

"ఏమోయ్ శంకర్రావ్! ఇప్పుడు పదిన్నరే కదోయ్ అవుతోంది. పదకొండున్నర అయిందని డబాయిస్తావేంటి ! బహుశా నువ్వు గంట ముందొచ్చి ఉంటావు. అంతేగానీ, మేము లేటొచ్చామని వించేస్తున్నావా?!" నా వాచీ చూపిస్తూ అన్నాన్నేను.

"అబ్బబ్బ ! మీ వాచీ తప్పేమోనండీ, బాబూ? నా వాచీ చూడండి—పదకొండున్నర. కరెక్టుగా ఫర్‌ఫెక్టు టైం నాది. రోజూ టైంకొచ్చే మీరు కూడా ఏంటండీ ఇంత లేటు?" అంటూ నన్ను అమాయకుడ్ని చూసినట్టు చూశాడు.

"అదేంటోయ్? ఇప్పుడే పది గంటలకి వివిధ

## వై. వి. శేషగిరిరావు

భారతి ప్రోగ్రాం అయిన తరువాత నా గడియారం సరిచేసుకుని ఆఫీసుకి బయల్దేరాను. ఏమండీ సుబ్బారావుగారు! మీ టైం ఎంతయిందండీ?" అన్నాను నేను ఆశ్చర్యంగా నా వాచీ వంకా, శంకర్రావ్ వంకా చూస్తూ.

"ఆ సరే ! నా వాచీ సంగతే అడిగావా ! అయినా చూస్తుండు, నాయనా...ఆ నాది పదింబావు అయింది" అంటూ ఆయన తన సీటులోకి వెళ్ళిపోయాడు ఏమీ వినాగా.

"ఆ హ్హ హ్హ హ్హ...! చూశారండీ! ఇదీ మీ వాచీల ప్రవాహం. ఎందుకండీ ఇంకా ఆరగా చేస్తారు. ఇవాళ గంట లేటు అందరూ. రోజూ నేను లేటొస్తానని మేనేజరు నామీద ఎగిరేవాడు. ఇవాళ ఆయనే ఇంతవరకూ..."

హఠాత్తుగా అతని వాక్ప్రవాహం ఆగిపోయిందేమిటాని గుమ్మం వంక చూశాను. మా మేనేజరు...గుమ్మంలో నిలబడ్డాడు, రెండు చేతులూ నడుంమీద వేసుకుని కోపంగా చూస్తూ!!

"ఆ ఏమోయ్ శంకర్రావ్! ఏవు డేంటో కూసి స్తున్నావ్. నేను గంట లేటొచ్చానా? నీ కో విషయం తెల్సా? నేను రోజూ కరెక్టుగా పది నిముషాలే లేటుగా వచ్చేది. ఇప్పుడు టైమెంత అయ్యిందో తెల్సా ! పదీ గంటా. అయినా. నాకు

తెలిక అడుగుతా...ప్రొద్దుటే ఏమయినా మన దేశానికు కొట్టొచ్చావా ఏంటి? పోయి నోర్మూసుకుని సీట్లో కూర్చో! రోజూ నువ్వు లేటుగా వస్తున్నావని నేను నిన్ను తిడుతున్నావని ఈ వేళోదో టైయానికే వచ్చి నాసిహాదే తప్పు చూపించాలనుకుంటున్నావా? పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు. పూ. పోయి కూర్చో. అర్రె...నీ సీట్లో కూర్చోమంటే టైపిస్టు సీట్లో కూర్చుంటూ, ఏంటా ఎర్రి చూపులు. ఛీ! ఛీ!''

పెట్టాల్సిన నాలుగు చివాట్లు పెట్టేసి సీరియస్‌గా తన రూంలోకి వెళ్ళి పోయాడాయన.

మాడిపోయిన ముఖం వేలాడేసుకుని నీరసంగా తన సీట్లోకి పోయి కూర్చున్నాడు శంకర్రావు.

పాపం శంకర్రావుని చూస్తే జాలి వేసింది. రోజూ ఏదో ఒకటి ఇలా చేస్తూ తిట్లూ, చివాట్లూ తింటుంటాడు. అసలు మనిషే విచిత్రంగా ఉంటాడు. అతను మా ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ మీద సంవత్సరం క్రితం వచ్చాడు. అతనికి పెళ్ళై ఎనిమిదేళ్ళ వాడొకడూ, ఆరేళ్ళ వాడొకడూ పిల్లలు ఉన్నారు. తమాషా ఏమిటంటే ఒకరితో వేలెత్తి చూపించుకోకుండా పనులు చేయాలనుకుంటాడు. కానీ, చివరికి అవి అతనికే ఎదురు తిరుగుతూ ఉంటాయి.

సర్లే ఈ శంకర్రావు గొడవ ఎప్పుడూ ఉండేదే అని అతగాడి విషయం వదిలేసి నేను పోయి నా సీట్లో కూలబడ్డాను. కాస్సేపటికి ఫైళ్ళలో మునిగి పోయాను. మెల్ల మెల్లగా స్టాఫ్ మొత్తం వచ్చి చేరుతున్నారు.

సుమారు గంట తరవాత—

మెల్లగా—

''మాస్టారూ'' అన్న గొంతు వినబడింది.

సింహం జూలు విదిలిస్తున్నట్టుగా ఫైళ్ళ మధ్యలో నుండి తల విదుల్చుకుంటూ తల పైకెత్తి కళ్ళ జోడులో నుండి చూశాను. శంకర్రావు టేబిల్ మీదకు వంగి మెల్లగా—

''ఏదేంటండీ, బాబూ! మేనేజరుగారు అలా అరుస్తారు. నా వాచీ గంట ముందు ఉందో, మీ వాచీలు గంట లేటున్నాయో నా కర్థం కావటం లేదు.'' సన్నని గొంతుతో అన్నాడు.

''అయ్యా శంకర్రావ్! మా వరకు మా వాచీలు కరెక్టే మరి. నమ్మకపోతే నీ వాచీ ప్రకారమే నువ్వు నడుచుకో'' అన్నాను చికాకుగా.

''అబ్బ అలా చికాకు పడతా రెందుకండీ, బాబూ! పోతున్నానులెండి'' అంటూ మేనేజరు గదిలో కెళ్ళిన టైపిస్టు సీట్లో కూర్చోబోయాడు.

''అదేంటోయ్! టైపిస్టు సీట్లో కూర్చుంటావ్! నీ సీట్లో కెళ్ళు'' అన్నాను ఆశ్చర్యంగా.

''ఓహో! ఇది టైపిస్ట్ సీటా! అవునవును. ఇది టైపిస్టు సీటే సుమా! వెధవది మతి చెడి పోయింది'' అని గొణుక్కుంటూ బుర్ర మీద చేత్తో కొట్టుకుని తన సీటు వైపు కదిలాడు శంకర్రావు.

ఇంతలో ఆఫీసు గుమ్మం లోకి అడుగు పెట్టిన కుర్రవాడు—''నాన్నా!'' అని పిలిచాడు. చేతిలో కారేజీ ఉంది. భుజాన పుస్తకా లున్న సంచి ఉంది.

''ఏరా! ఇంట్లో వెధవ. స్కూలు కెళ్ళకుండా ఇక్కడి కెందుకు తగలడ్డావురా! ఇప్పుడు టైం పన్నెండున్నర అయితే, ఇంకా స్కూలు కెళ్ళలేదు. ఇవాళ ఎగ్గొట్టా, వుట్రా!'' శంకర్రావ్ విసుగు, చిరాకు ప్రదర్శిస్తూ కసురుకున్నాడు కొడుకు మీద.

''నా స్కూలు పన్నెండు గంటలకి కదా! ఇంకా అరగంట టైముంది, ఈ కారేజీ తీసుకెళ్ళి నీ కిచ్చి నన్ను స్కూలు కెళ్ళమని చెప్పింది, నాన్నా, అమ్మ!''

''ఏంట్రా ఇంకా అరగంటుందా! నీకు మతి కానీ పోయిందా ఏమిటి, వెధవ! పన్నెండున్నర అవుతూంటే. అందరూ గంట లేటా, లేటూ.''

''అదేంటి, నాన్నా! రోజూ ఆఫీసుకు లేటవుతూందని వాచీ గంట ముందు పెట్టుకుని, ఆ సంగతి మరిచిపోయి ముందు వచ్చేశావు. అమ్మ చెబుతున్నా వినిపించుకోలేదు. వంట కాలేదని ఉదయం భోజనం కూడా తినకుండా వచ్చేశావు. ఆకలితో మాడతావని ఈ కారేజీ నన్ను ఇచ్చి స్కూలు కెళ్ళమంది. ఊఁ. తీసుకో నాకు టైం అయింది'' అని చెప్పి కారేజీ అక్కడ పెట్టేసి వెళ్ళిపోయాడు శంకర్రావ్ కొడుకు.

దాంతో ఆఫీసంతా నవ్వుల వర్షం కురిసింది. ఆ వర్షానికి తట్టుకోలేక శంకర్రావ్ అర్జెంటుగా బయట కాంటీనుకి వెళ్ళాడు.

అయ్యా! అదీ సంగతి!

శంకర్రావ్‌కు మా చెడ్డ మతి మరుపు! నా మతి మండా! ఈ విషయం ఇందాకట్నుంచి మరిచే పోయాను సుమా! *


